పొంచిఉన్న ప్రమాదం

కూడలి చిన్నది..సమస్య పెద్దది

మరో పది రోజులైతే బడులు ప్రారంభం

- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్..
- నోళ్లు తెరిచిన ఫ్యూజు బాక్సులు..
- వీటి కిందే చెత్త డంపింగ్

అమీర్‌పేట్, మే 29: నిత్యం జన సంచారంతో బిజీగా ఉండే ఆ చిన్న కూడలిలోని ట్రాన్స్‌ఫార్మర్ పాదచారులకు, వాహన దారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. సనత్‌నగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్ 820 ఎదురుగా పార్కు ప్రహరీకి ఆనుకుని ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అనేక సమస్యలు పొంచి ఉన్నాయి. అసలే గోతులు తేలిన చిన్న కూడలి.. అక్కడే కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్.. నోళ్లు తెరిచిన ఫ్యూజ్ బాక్సులు.. ఇవి చాలవన్నట్టుగా పడకేసిన పారిశుద్ధ్యం ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల చుట్టూ చెత్తా చెదారం డంపింగ్. సమస్యలతో చిన్న కూడలిగా ఉన్న ఈ మార్గంలో రాకపోకలు సాగించడం పాదచారులకే కాక వాహనదారులకు కూడా ఒకింత ఇబ్బందికరంగా మారింది. చిన్న వర్షానికి కూడా ఇక్కడి గోతుల్లో నీరు చేరుతుండడంతో పాదచారులకు ఈ మార్గంలో నడక కొన్ని సందర్భాల్లో సవాల్‌గా మారుతోంది.

విద్యార్థుల రాకపోకలు ఈ మార్గంలోనే..

ఇక్కడి సమపంలోని హిందూ పబ్లిక్ స్కూల్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చేరేందుకు కూడా ఇదే ప్రధాన మార్గం. వేసవి సెలవులు కావడంతో విద్యార్థుల సంచారం ఇప్పుడు లేదు. త్వరలోనే పాఠశాలలు తెరుచుకుంటున్న పరిస్థితుల్లో.. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వందల సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థులను తరలించే వ్యాన్లు, ఇతర వాహనాలతో మరి కొద్ది రోజుల్లోనే ఈ కూడలి బిజీగా మారనుంది.

సనత్‌నగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్ 820 ఎదురుగా కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, దాని కిందనే చెత్త వేస్తున్న దృశ్యం

వెంటనే పరిష్కరించాలి

ఎస్ఆర్టీ 820 ఎదురుగా నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర డంపింగ్ చేయొద్దంటూ చెబుతున్నా స్థానికులు పెడచెవిన పెడుతున్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు.. అదే సమయంలో విద్యార్థుల సంచారంతో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలి..

– శంకర్‌గౌడ్, తులసీనగర్

త్వరలోనే పరిష్కరిస్తాం

సనత్‌నగర్ ఎస్ఆర్టీ 820 ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బాగా ఎత్తులో ఉండడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం లేదు. అయితే ఫ్యూజ్ బాక్సులను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో చెత్తను డంప్ చేసేలా ప్రోత్సహించవద్దంటూ గతంలోనే పారిశుద్ధ్య విభాగం అధికారులకు సూచించడం జరిగింది.

– శేఖర్, ఏఈ ట్రాన్స్‌కో సనత్‌నగర్

మద్యపానాన్ని నిషేధించాలి

చిక్కడపల్లి, మే 29 : మద్యపానంను సంపూర్ణంగా నిషేధించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం శ్రీనివాస్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. డాక్టర్ సింగం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. మద్యపానం వల్ల ఎందరో యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఎన్నో కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్, నాయకులు అనిత హరి, పుష్పాంజలి, నవీన్, సత్య నరసింహ గుప్తా, నంది కొండల రావు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

గోల్నాక, మే 29 : పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్‌ల్యాండ్స్) రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వృత్తిలో రాణించే వారి కోసం రేపు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు హరిసందీప్, మువ్వ రాంరెడ్డి, లక్ష్మీకుమారి తెలిపారు. 31న సికింద్రాబాద్ రాణిగంజ్ గుజరాతీ హైస్కూల్లో 30కి పైగా సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. పదో తరగతి నుంచి ఎంబీఏ, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ చేసిన 18-30 ఏండ్ల లోపు వారు అర్హులని వారు తెలిపారు. వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్ సైట్, 95424 33427 నంబర్లో సంప్రదించాలని కోరారు.

బి కేటగిరి సీట్లను కౌన్సిలింగ్‌తో భర్తీ చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ బి కేటగిరి సీట్లను కౌన్సిలింగ్‌తో భర్తీ చేయాలని కోరుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రతినిధి బృందం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రికి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు యాజమాన్య కోట కింద భర్తీ చేసే సీట్లకు విద్యార్థుల నుంచి లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఆదివాసీ విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఎస్‌యూ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 29: ఆదివాసీ విద్యార్థులకు సరైన వసతి గృహాలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సాగబోయిన పాపారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాపారావు మాట్లాడుతూ.. అడిక్‌మెట్‌లోని ఆదివాసీ బాలికల హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు, నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. నగరంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఆదివాసీ నిరుద్యోగ యువతకు వసతి, స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అడిక్‌మెట్ హాస్టల్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న 250 గజాల స్థలంలో నూతన భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీనితో పాటు నగరానికి వచ్చి నివాసముంటున్న నిరుద్యోగ యువతకు నివాసగృహం, స్టడీ సర్కిల్ ఏర్పాటుకు బంజారాహిల్స్‌లోని తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కొమురం భీం భవన్ కేటాయించాలని ఇప్పటికే మంత్రి సీతక్క ఆదేశించారని చెప్పారు.

దీనిపై అధికారులు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌యూ నాయకులు ఆరెం అరుణ్‌కుమార్, మల్లెల వెంకట్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మౌలాలిలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

మల్కాజిగిరి, మే 29: నియోజకవర్గంలోని దేవాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జూన్ 1నుంచి 3 వరకు జరగనున్న మౌలాలి డివిజన్, హెచ్‌బీ కాలనీ ఫేజ్-2లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం 22వ వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ.. వార్షికోత్సవంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని పండుగలను అధికారికంగా నిర్వహించారని అన్నారు. దేవాలయాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షు డు పైళ్ల బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్‌వీ రమణారావు, లక్ష్మిరెడ్డి, లక్ష్మీప్ర భావతి, కార్యదర్శి కేబీ ప్రసాద్, జితేందర్‌రావు, సంజీవరాణి, ప్రవీణ్, తది తరులు పాల్గొన్నారు.

చెత్తకుండీలు లేని నగరంగా తీర్చిదిద్దాలి

అవగాహన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్, మే 29 : నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న జీహెచ్ఎంసీకి ప్రజలు సహకరించాలని, ఖాళీ ప్రదేశాలలో చెత్త వేయకూడదని జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం పద్మారావునగర్‌లోని స్కందగిరి కాలనీ సమోసా పార్కు సమీపంలో బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి.సమ్మయ్య, శానిటేషన్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌లతో కలిసి అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపిస్తే అక్కడ కొందరు చెత్త, చెదారం, నిర్మాణ వ్యర్థాలను వేస్తున్నారని అన్నారు. అలాంటి వారికి రూ.1000 వరకు జరిమానా విధిస్తామన్నారు. ప్రతి ఇంటికి రెండు చెత్తబుట్టలను ఇవ్వడం జరిగిందని, ఇంటికి వచ్చే రిక్షావారికే ఇంట్లోని చెత్తను ఇవ్వాలన్నారు. నగరాన్ని చెత్తకుండీలు లేని నగరంగా మారుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ధన గౌడ్, ఎస్ఎఫ్ఏలు గోవింద్, రాజు, యాదగిరి, నారాయణ, వినోద్, ప్రసాద్ రావు, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి:సర్టిఫికెట్లు ప్రదానం

అమీర్‌పేట్, మే 29 : కమ్మ సంఘం అమీర్‌పేట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ ద్వారా కంప్యూటర్ బేసిక్స్‌లో 60 రోజులుగా ఉచిత శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు బుధవారం సంస్థ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు ప్రదానం జరిగింది. అమీర్‌పేట్ కమ్మ సంఘం హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పూర్తి చేసుకున్న 90 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులాలకు అతీతంగా అందరికీ ఉచితంగా కంప్యూటర్స్ బేసిక్స్‌లో సంఘం తరపున శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తదుపరి బ్యాచ్‌కు అభ్యర్థుల ఎంపికకు ఈ నెల 31న ఉదయం 10 నుండి అమీర్‌పేట్ కమ్మ సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు జూన్ 3 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత ఉంటే సరిపోతుందని, మరిన్ని వివరాలకు 9849566945, 9177661161లలో సంప్రదించాలని కోరారు.

'గాజా మారణహోమానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం'

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి. ప్రసాద్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 29: గాజా మారణహోమానికి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు గొంతెత్తాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి. ప్రసాద్ పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును నిర్వహించారు. దీనికి ప్రధాన వక్తలుగా సామాజిక, రాజకీయ కార్యకర్త సారా మాథ్యూస్, ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజల జాతి ఆకాంక్షలను అణిచివేస్తూ పాలస్తీనాపై బాంబు, వైమానిక దాడులు చేస్తూ మారణ హోమాన్ని సృష్టిస్తున్నారన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమిత దాడుల్లో పాలస్తీనా వైద్యులు మరణించారని, ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు, గ్రంథాలయాలు, విశ్వవిద్యాలయాలు బాంబు దాడులలో ధ్వంసమై శిథిలాలుగా మిగిలాయన్నారు. ఇదిలా ఉండగా ఇజ్రాయిల్ తన దురాక్రమణను యథేచ్ఛగా సమర్థించుకుంటున్నట్లు, తమ రక్షణ కొరకే పాలస్తీనా ప్రజలపై దాడులు చేస్తున్నామని ఇజ్రాయిల్ చెప్పడమంటే ప్రపంచ శాంతిని ప్రత్యక్షంగా ధ్వంసం చేయడమేనని అభిప్రాయపడ్డారు. గాజాలో ఇప్పటి వరకు దాదాపు 35 వేల మంది ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సాయుధ బలగాలచే వందలాది మంది పాలస్తీనియన్లు చంపబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జార్జిరెడ్డి మిత్రులు బూర్గుల ప్రదీప్, ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, వివిధ సంగాల నాయకులు మహేశ్, సాగర్, శ్రీకాంత్, కోల లక్ష్మీనారాయణ, ఝాన్సీ, గౌతమ్ కుమార్, శ్రీకాంత్, గొర్రె పాటి రమేశ్, రవి, మస్తాన్, తిరుపతి, చరణ్, శ్రీనివాస్, సంతోష్, కార్తీక్, పవన్, పుష్ప, సంతోష, ఆసియా తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయవద్దు..

మల్కాజిగిరి, మే 29: ప్రజల ఆరోగ్యం కోసం రోడ్లపై చెత్త వేయవద్దని మల్కాజిగిరి సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మౌలాలి డివిజన్, గాంధీనగర్‌లో 'బస్తీ ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా రోడ్లపైన చెత్త వేయవద్దని ఇంటింటికి వెళ్లి సంప్రదాయంగా మహిళలకు బొట్టుపెట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. తడి-పొడి చెత్తను వేయడానికి ఇప్పటికే గత ప్రభు త్వం రెండు బుట్టలను అందజేసిందని అన్నా రు. ఉదయాన్నే కాలనీలు, బస్తీలకు వచ్చే ఆటో ట్రాలీల్లో చెత్త వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప, బుడంపల్లి శ్రీనివాస్, అజయ్, అంజయ్య, మనీషా, తదితరులు పాల్గొన్నారు.

రైల్లోంచి జారి పడి వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, మే 29: రైల్లోంచి ప్రమాదవశాత్తు జారి కింద పడిన గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. రామకృష్ణ పురం- క్యాపిటల్ రిలీఫ్ రైల్వే స్టేషన్ల మధ్య రైల్లోంచి బుధవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి జారి కింద పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై కాపీ కలర్ ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ముస్లింగా భావిస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ప్రతి ఇంటికి ఇంకుడుగుంత

అమీర్‌పేట్, మే 29 : అడుగంటుతున్న భూగర్భ వనరుల కారణంగా బోర్లన్నీ ఎండిపోతున్నాయి. సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీలో బోర్లు ఎండిపోవడంతో కాలనీ నివాసితులు ఈ ఎండాకాలంలో ఇప్పటివరకు ఎదుర్కొన్న ఇబ్బందులు వర్ణనాతీతం. గతంలో ఎన్నడూ చూడని పరిస్థితులు తలెత్తడంతో ఎలాగైనా భూగర్భ నీటి వనరుల పరిరక్షణ కోసం ఇంకుడు గుంతల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలనే నిర్ణయానికి కాలనీ వాసులు వస్తున్నారు. ఈ మేరకు ఈ యేడాది అత్యధిక సంఖ్యలో ట్యాంకర్లు తెప్పించుకున్న కాలనీల వివరాలను సేకరించిన జలమండలి ఆధ్వర్యంలో దాదాపు 18 ఎన్‌జీవోలు ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తూ నీటి కరువుకు గల కారణాలను అన్వేషిస్తోంది. ఆ విధంగా జలమండలి విభాగంలో ఇంకుడు గుంతల విభాగం ప్రత్యేక అధికారి, విశ్రాంత జియాలజిస్ట్ (భూగర్భ జల విభాగం) జల సత్యనారాయణ రెండు రోజులుగా సనత్‌నగర్ జెక్‌కాలనీలో పర్యటిస్తున్నారు. కాలనీలోని దాదాపు 10కి పైగా అపార్ట్‌మెంట్లలో జరిగిన ఇంకుడు గుంతల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రత్యేక అధికారి జల సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అమల్లో ఉన్న గుంతల్లో పూడికలు తొలగించే విధానం, కొత్తగా నిర్మాణాలు చేపట్టాలనుకునే వారికి కూడా పలు సూచనలు చేశారు. నీటి ఎద్దడిని అధిగమించాలంటే ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పడుతూ, భవిష్యత్తు కోసం భద్ర పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కాలనీ నివాసితులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి జల సత్యనారాయణ

జూన్ 1న నృత్య సంగీతంపై ప్రసంగం

చిక్కడపల్లి, మే 29 : సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల ప్రసంగ పరంపరలో భాగంగా నృత్యసంగీతంపై ప్రత్యేక కార్యక్రమాన్ని జూన్ 1న త్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు సమితి అధ్యక్షుడు వేమ రాజు విజయ్‌కుమార్, సమన్వయకర్త నిష్టల సుధామాల వివరించారు. బుధవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

COURT NOTICE

BEFORE THE HON'BLE I ADDL. CHIEF JUDGE AT: SECUNDERABAD

O.S. No. 126 OF 2023

BETWEEN:
SMT. USHA KARAN ARORA .....Plaintiff
AND
BANDA CHANDRA REDDY ....Defendants

To
SRI. BANDA CHANDRA REDDY
S/o. Sri. Late Narsimha Reddy,
Aged about: 53 Years, Occ: Business,
R/o. H.No.12-13-829, Gokul Nagar,
Tarnaka, Secunderabad, T.S-500017.

Please take the notice in **O.S. No. 126 of 2023** filed by the plaintiff SMT. USHA KARAN ARORA before the Hon'ble I Addl Chief Judge at Secunderabad. You are hereby summoned to appear before this Hon'ble Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the O.S. on **07th JUNE, 2024** i.e., **07-06-2024** at **10.30 A.M.**

(BY ORDER OF THE HON'BLE COURT)

Sd/- P.H. PANNAGA SAI,
Advocates & Associates,
24, 4-3-72/1/27, T.L. Kapadia Apts.
Kandaswamy Lane, Sultan Bazar,
Hyderabad-500001. Ph. 9394554751

'సురవరం రచనలు ఆదర్శం'

ముషీరాబాద్, మే 29 : త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వమహనీయుల యాదిలో భాగంగా బుధవారం తెలంగాణ వైతాళికుడు డాక్టర్ సురవరం ప్రతాపరెడ్డి సంస్మరణ సభ జరిగింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని సురవరం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదర్శనీయ రచనలు చేసిన సురవరం సమాజహితం కోసం విశేషంగా కృషి చేసిన ఉద్యమశీలి అని కొనియాడారు.

జనంలో చైతన్యాన్ని రగిల్చిన విప్లవ వీరుడని, తెలంగాణ ఆత్మాభిమానానికి ఎత్తిన పతాకగా గోలకొండ కవుల సంచికను నిలిపారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ మూర్తి, పెద్దూరి వెంకటదాస్, లయన్ ఎస్ఎన్ కామత్, శ్రీమణి పాల్గొన్నారు.



సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన కళా జనార్దనమూర్తి

నేడు హుండీ లెక్కింపు..

చిక్కడపల్లి, మే 29 : వివేక్‌నగర్ శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కించడం జరుగుతుందని ఈఓ దేవనాథం తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు.

కచ్చామోరీ మరమ్మతులు..ముమ్మరం

చిక్కడపల్లి , మే 29 వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా గాంధీనగర్ డివిజన్‌లో కచ్చామోరీ మరమ్మతులు చేయిస్తున్నామని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పనులను బుధవారం కార్పొరేటర్ పావని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నాయకులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు ముమ్మరం: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించనున్నారు. దానిలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.